# సమయస్ఫూర్తి

శ్రీమతి పాకల చంద్రకాంతామణిగారు

గోధూళికాసమయము. చల్లనిపిల్లగాలులు వీచుచున్నవి. ఆకాసము మేఘావృతమైయున్నది. చిన్నపిల్లమేఘము లాకాశమునందంతటను తిరుగాడుచుండెను. సగముకట్టుచున్నడాబాపై సుదర్శనం యేకాగ్రచిత్తతతో నిన్న వ్రాసివిడిచిన పటమును పూర్తిచేయుచుండెను. అతని మనస్సంతయు పటముపైననేలగ్నమైయుండెను. పటముతప్ప వేరేప్రపంచ మాతనికి గానరాకుండెను.

నిశాదేవి తనవైరిని సంహరించి జయముగాంచితినను హర్షముతో భానుండస్తమింపగనే మెల్లమెల్లన తన రాజ్యమాక్రమించుచుండెను. సంజకెంజాయలలముకొనుచుండెను. సుదర్శనునిపటము పూర్తియాయెను. అంత యాసక్తితో రచించిన తన పటమెట్లుండునో చూతమని సుదర్శనుడు పటముపైననే దృష్టినుంచి వెనుక కడుగులువైచుచు ఇంకను గోడపెట్టని డాబాచివరవరకు వెళ్లెను.

సుదర్శనునినౌకరు 'రాము' పటమువెనుక డాబాపై కూర్చుండి సుదర్శనుని పాదరక్షలను శుభ్రపరచుచుండెను.

ఆకస్మికముగా రాము తలెత్తిచూచెను. తన యజమానుడున్న భయానకస్థితి వానికి నయనగోచరమాయెను. సుదర్శనుడు పటముమీది యోచనచే రెండవది పరికింపక ఇంకను వెనుక కడుగులువైచుచు పోవదొడంగెను. అతడు మరొకడగు వెనుకకువైచిన అధఃపతితుడుగావలసినదే. రామునకుగోచరించిన స్థితిగతులిట్టివి.

పటమువద్దనే చిన్న పళ్లెముతో పటమునకు వేసిరంగుగలదు. రాము తటాలున నారంగునంతను పటముపై బడవేసెను.

అంతయు రెప్పపాటుకాలమున జరిగినది. సుదర్శనున కాగ్రహామువచ్చెను. అంత యాశతో లిఖించిన పటమట్లుచెడుటచే గల్గిన నిరాశాగ్రహములొక్కసారి ఉదయింప సుదర్శనుడు ముందునకుబరువిడివచ్చి రాముని గొట్ట చేతులెత్తెను. "ప్రభూ! మీరు నన్నుకొట్టినకొట్టుడు. ప్రాణములు నిల్చినవదియేచాలు" ననెను రాము. సుదర్శనునకు తెలివివచ్చెను. రెప్పపాటుకాలమున జరిగినది తెలుసుకొనెను. వానిసమయస్ఫూర్తి కెంతయు సంతసించి తటాలున వానినాలింగనము చేసుకొని "రామా! నీ ఋణం నే నెన్నటికీ తీర్చుకోలే" నంటూ ఆనందబాష్పాలు విడిచాడు సుదర్శనం.